

### 'ధరణి'తోనే అక్రమాలకు అడ్డుకట్ట..

తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' అమలు చేశాకే భూముల విషయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. రైతులకు భరోసా ఏర్పడడంతో పాటు భూముల ధరలు పెరిగినయ్.. అమ్మినా, కొన్నా సులువుగా రిజిస్ట్రేషన్లు, నిమిషాల్లోనే పట్టాదారు పాసు పుస్తకం చేతికి వస్తున్నయ్. చీటికిమాటికీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

– తోట గిరియాదవ్, ఆమనగల్లు మున్సిపాలిటీ



### పాత పద్ధతి వస్తే కష్టమే..

'ధరణి'ని రద్దు చేసి పాత పద్ధతి వస్తే, మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరుగాల్సి వస్తది. పటేల్, పట్వారీ వ్యవస్థతో అవస్థలు పడ్డం. ధరణితో సమస్యలు తొలిగాయి. వేరే పోర్టల్‌ను తీసుకొస్తే దళారుల రాజ్యమే వస్తది. పట్టదారు పుస్తకాలు, మ్యుటేషన్ అంటూ నానా బాధలు పడాలి. అధికారులు సైతం చేతివాటం ప్రదర్శిస్తరు.

– దావ గిరిధర్, సంకటోనిపల్లి గ్రామం, ఆమనగల్లు మున్సిపాలిటీ



### అర్హతలేని పార్టీని నమ్మితే ఆగమే..

'ధరణి'ని రద్దు చేసి వేరే పోర్టల్‌ను తీసుకొస్తామంటున్న అర్హత లేని పార్టీని నమ్మితే రైతులు ఆగమైతరు. ధరణి లేకముందు అనుభవించిన కష్టాలు గుర్తు చేసుకుంటే కన్నీళ్లు వస్తయ్. ఇంటిపేరు తప్పు, సర్వే నంబర్లు తప్పు ఇలా వీటిని సరి చేసుకోవాలంటే ఏండ్లకొద్దీ తిరిగేది. ధరణి వచ్చాకే అన్ని పనులు సులువైనయ్.

– మంగలి వెంకటేశ్ (చేవెళ్లటౌన్)



### పాత పద్ధతొద్దు.. ఆ పట్వారీ వ్యవస్థ వద్దు..

అర్హతలేనోళ్లు తీసుకొస్తామంటున్న కౌలుచట్టం.. ఆ పాత పద్ధతొద్దు.. పట్వారీ వ్యవస్థ అసలే వద్దు.. చెప్పులరిగేలా తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరిగేది. పంట నష్టం రాయాలన్నా, బ్యాంక్ లోన్ ఇవ్వాలన్నా, భూ రికార్డులు కావాలన్నా పైసలియ్యనిదే పని కాకపోయేది. ధరణి వచ్చాకే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, పాసుబుక్‌లు ఇబ్బంది లేకుండా వస్తున్నయ్.

– ఇస్లావత్ ధర్మానాయక్, టాక్‌రాజ్‌గూడ (కడ్తాల్)



### కౌలు చట్టంతో ఇబ్బందులే..

కౌలు చట్టం తెస్తే పట్టాదారులకు ఇబ్బందులే. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి.. రైతుల్లో ధైర్యాన్ని నింపింది. తెలంగాణ రాకముందు భూ రికార్డులన్నీ గందరగోళంగా ఉండేవి. గ్రామాల్లో నిత్యం భూములకు సంబంధించిన గొడవలు జరిగేవి. తహసీల్దార్ కార్యాలయాలన్ని పైరవీకారులతో నిండిపోయేవి. పహాణీ పేపర్లు కావాలన్నా, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా దళారులదే రాజ్యంగా ఉండేది.

–గంప వెంకటేశ్‌గుప్తా (కడ్తాల్)



### 'ధరణి'ని రద్దు చేస్తే మళ్లీ కష్టాలే..

'ధరణి'ని రద్దు చేస్తే అన్నదాతలకు మళ్లీ కష్టాలే.. దళారులు, అధికారులకు దండం పెట్టుకుంటా తిరుగాలె. రాజకీయం లబ్ధి కోసం ధరణిని తీసి వేయవద్దు. మాయదారి మాటలను నమ్మితే పాత పద్ధతులతో పెత్తందారుల రాజ్యం వస్తది. కల్లబొల్లి మాటలు మాట్లాడే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు.

– దేవిడి విజయ్‌భాస్కర్‌రెడ్డి, తట్టిఅన్నారం, పెద్దఅంబర్‌పేట



### లంచాలు ఇస్తేనే పని అయితది..

'ధరణి'ని తీసేసి పాత పద్ధతి తీసుకొస్తే మళ్లీ దళారుల రాజ్యమొస్తది. పటేలు, పట్వారీ, దళారులు, అధికారులు.. ఇలా అందరికీ లంచాలు ఇస్తేనే భూముల పనులు అవుతయ్. లేకపోతే ఏండ్ల తరబడి తిరుగాల్సి వస్తది. పాతకాలం రికార్డుల ప్రకారం బలమున్నవాడిదే భూమి అన్నట్లు ఉండేది. ధరణి పోతే కష్టం.


– కెప్టెన్ అంజన్ గౌడ్, అంతారం గ్రామం (చేవెళ్ల రూరల్)



# ధరణి లేకుంటే.. దందాలే..

- ధరణిని రద్దు చేస్తామన్న పార్టీని మేమే రద్దు చేస్తం
- ఆ పార్టీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తాం
- భూములకు భద్రత కల్పించిన బీఆర్ఎస్‌కే మా మద్దతు
- స్పష్టం చేస్తున్న జిల్లా రైతాంగం

రంగారెడ్డి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని చెబుతున్న ఓ పార్టీ నేతలపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఆ పార్టీని నమ్మితే నిండా మునగడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. పైరవీకారులు రాజ్యమేలుతారని, లంచావతారులు పుట్టుకొస్తారని, ఏ చిన్నపనికైనా అధికారులు ఏండ్ల తరబడి తిప్పుకుంటారని వాపోతున్నారు. రికార్డులు తారుమారు చేసి ఒకరికొకరికి మధ్య పంచాయితీలు పెడతారని మండిపడుతున్నారు. అలవిగాని హామీలతో తెలంగాణలో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ కొత్త కుట్రలకు తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా భూదందాలు సాగించేవారని, 'ధరణి' స్థానంలో మరో పోర్టల్‌ను తెచ్చి దోపిడీకి పాల్పడాలని చూస్తున్నారని విమర్శిస్తున్నారు. భూముల ధరలు పతనం కావడంతో వ్యవసాయంపై ఆధారపడ్డ అనేక రంగాలు సైతం కుంటు పడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ హక్కుల కోసం గతంలో పడ్డ ఇబ్బందులు ఇంకా కండ్ల ముందు కదలాడుతున్నాయని, ఈసారి ఎన్నికల్లో అర్హత లేని పార్టీకి డిపాజిట్ దక్కనివ్వకుండా తరిమికొడతామని శపథం చేస్తున్నారు. ధరణిని రద్దు చేయడం కాదు..తామే అర్హతలేని పార్టీని రద్దు చేస్తామని బాజాప్తా చెబుతున్నారు.



### రైతులను మోసం చేస్తే పుట్టగతులు ఉండవు..

వేరే పోర్టల్‌తో రైతులను మోసం చేయాలని చూస్తున్న ఓ పార్టీకి పుట్టగతులు ఉండవు. ధరణి లేనప్పుడు ఎన్ని అవస్థలు పడ్డామో.. గుర్తు చేసుకుంటేనే గుండె గుబుల్లుమంటున్నది. ధరణితోనే భూ సమస్యలు పరిష్కారమయ్యాయి.

– మోహన్‌రెడ్డి, బ్రహ్మణపల్లి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

### 'ధరణి'తోనే రైతుకు భరోసా..



'ధరణి' వచ్చాకే రైతుకు భరోసా వచ్చింది. అరగంటలో భూమి రిజిస్ట్రేషన్, వీలైనంత త్వరగా పాసు పుస్తకాలు చేతికొస్తున్నాయి. ఏ సమస్య ఉన్నా మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. పటేల్, పట్వారీ వ్యవస్థతో గోస పడ్డది చాలు. మళ్లీ ఆ బాధలు పడలేము. గతంలో పడిన బాధలను మరువం. ఇప్పుడు లేనిపోని మాటలు చెబితే నమ్మం.


– గూడూరు సుధాకర్‌రెడ్డి, బోడంపహాడ్(షాబాద్)

### 'ధరణి'ని తీసేస్తే లంచాల బాధ తప్పదు..



బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. ధరణి పోర్టల్ ద్వారా అరగంటలో భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వారం రోజుల్లోనే పాస్ బుక్ ఇంటికి వస్తుంది. ఎక్కడా ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం వేలిముద్ర వేస్తేనే పోర్టల్ ఓపెన్ అవుతుంది. ధరణిని తీసేస్తే మళ్లీ లంచాల బాధ తప్పదు.

– ఏనుగు తిరుమల్‌రెడ్డి, బ్రహ్మణపల్లి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ



# 3 గంటల కరెంట్‌తో.. కాళ రాత్రులే..

- కరెంటు లేని ఎవుసాన్ని ఊహించుకోలేం
- నిరంతర కరెంట్ లేకపోతే రైతులు ఆగమైతరు..
- మండిపడుతున్న జిల్లా రైతాంగం
- రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



రంగారెడ్డి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : మూడు గంటల కరెంట్‌తో కాళ రాత్రులే దిక్కవుతాయని రంగారెడ్డి జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కరెంటు విషయంలో రైతులు పడిన కష్టాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో వచ్చిన కరెంట్‌తో పంటలు పండక తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట కరెంటుతో రైతులు అర్ధరాత్రి అపరాత్రి బాయిల దగ్గరకు వెళ్లే భయంకర అనుభవాలను మర్చిపోలేక పోతున్నామని చెబుతున్నారు. రాత్రి పూట బావుల వద్దకు వెళితే పాములు కరిచి, కరెంటు కాటుకు గురై ఎంతో మంది రైతులు మరణించారని, అవన్నీ కండ్ల ముందర కదలాడుతున్నాయని, బాధిత కుటుంబాలు ఇప్పటికీ పడుతున్న బాధలతో చలించిపోతున్నామని పేర్కొంటున్నారు. అర్హత లేని పార్టీ అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంట్ ఇస్తామని చెబుతుండడంతో రైతులు ఆగ్రహిస్తున్నారు. ఇలాంటి పార్టీకి అధికారం ఇస్తే ఎదురయ్యే కరెంటు కష్టాలను తల్చుకుని భయపడుతున్నారు. కరెంటు విషయంలో సీఎం కేసీఆర్ తెచ్చిన సంస్కరణలను రైతులు కొనియాడుతున్నారు. 24 గంటల ఉచిత కరెంటుతో ధీమాగా బతుకుతున్నామని, కల్లబొల్లి మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మితే బతుకుదెరువు కతమైతదని, బాయిల వద్ద జాగారాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు పెను భారమని, పనికిరాని ముచ్చట్లు చెబుతున్న మాయదారి నాయకులను ఎవరూ నమ్మరని స్పష్టం చేస్తున్నారు. రైతుల మేలు కోరి పని చేస్తున్న బీఆర్ఎస్‌కే మా మద్దతు అని జిల్లా రైతాంగం చెబుతున్నది.





### ఎవుసం ఆగమే..

మూడు గంటల కరెంటుతో ఎవుసం ఆగమే.. ఎప్పుడస్తదో, ఎప్పుడు పోతదో తెల్వని కరెంట్‌తో మళ్లీ బావుల కాడ పడిగాపులు కాయాల్సిందే. 10 హెచ్‌పీ మోటర్ ఏర్పాటు చేస్తే అటు ట్రాన్స్‌ఫార్మర్లపై, ఇటు మోటర్లపై తీవ్ర ఒత్తిడి పెరిగి, కాలిపోయే ప్రమాదం ఉంది. వీటిని మరమ్మతులు చేయిస్తే, కొన్న ధరను మించి మెకానిక్‌లకు చెల్లించాలి.

– ఇమ్రాన్, సింగప్ప గూడ గ్రామం (చేవెళ్లటౌన్)



### ఒక్క మడి కూడా పారదు..

బావుల్లో నీళ్లు ఉన్నా.. 10 హెచ్‌పీ మోటర్‌తో నష్టమే.. గట్లకు గండ్లు పడి నీరు వృథా అవుతది. ఒక్క మడి కూడా సరిగ్గా పారదు. 5 హెచ్‌పీ మోటర్లతో ఇబ్బంది లేకుండా సాగు చేసుకుంటున్నం. ఓ పార్టీ మాటలింటే మళ్లీ రాత్రిళ్లు బోరుబావుల వద్ద జాగారం చేయాల్సిందే. రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్ పోతే ఆ రోజు కరెంటు బందే. 24గంటల కరెంట్‌తో పండుగలా సాగు చేసుకుంటున్నం.

– జ్ఞానేశ్, షాద్‌నగర్‌టౌన్



### మూడు గంటల కరెంట్ సరిపోదు..

వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోదు.. కొందరు నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఎవుసం చేస్తే రైతుల కష్టాలు తెలుస్తయ్. 10 హెచ్‌పీ మోటర్‌ని పెట్టుకొనే ఆర్థిక స్థోమత లేదు. గడికిగడికి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతే ఎవరు చేయిస్తరు. 24 గంటలు కరెంట్‌తో చింతలేకుండా ఉన్నం.

–అమృతం పాండు, (కడ్తాల్)



### కాల్వ అయినా సాగుతదా ?

మూడు గంటల కరెంట్‌తో కాల్వ అయినా సాగుతదా. వ్యవసాయం తెలిసి వాళ్లు ఎవరూ మూడు గంటల కరెంట్ సరిపోతుందని అనరు. 24 గంటల కరెంట్‌తోని రైతు నిబ్బరంగా పొలాలకు నీరు పారించుకుంటున్నాడు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు, కరెంట్ షాకులు తప్పేలా లేవు. ఏ రైతుకు కూడా 10 హెచ్‌పీ మోటరు అవసరం లేదు.

– నేనావత్ పత్యానాయక్, 3వ వార్డు, ఆమనగల్లు మున్సిపాలిటీ (ఆమనగల్లు)



### కరెంటు కష్టాలు మళ్లొద్దు..

గత ప్రభుత్వాల పాలనలో కరెంట్‌తో రైతులు కష్టాలు పడ్డరు. మళ్లీ ఆ కష్టాలు పడేందుకు సిద్ధంగా లేము. రాత్రి మూడు గంటలు, పగలు మూడు గంటలు కరెంట్‌తో ఇబ్బందులు పడేవాళ్లం. రాత్రిళ్లు భయం భయంతో పొలం వద్దకు వెళ్లే వాళ్లం. కరెంట్ షాక్ వస్తుందనో ఏదైనా పురుగుబూషి కరుస్తుందనే భయం ఉండేది. మధ్య మధ్యలో కరెంట్ పోయి వచ్చేది.

– బాల్‌రెడ్డి, కంచిమోనిగూడ, మొయినాబాద్



### 10 హెచ్‌పీతో భూగర్భ జలాలు అడుగంటుతయ్..

10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఊటను తొందరగా గుంజేస్తే భూగర్భ జలాలు అడుగంటుతయ్. ఐదారు ఎకరాలు సాగు చేసే రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఇప్పడిస్తున్న 24 గంటల కరెంట్ సక్రమంగా వస్తుంది. ఓ పార్టీ నాయకుల మాటలు హాస్యాస్పదం. వారికి ఎవుసంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు.

– మంచె పెద్ద రాములు, అజీజ్‌నగర్, మొయినాబాద్



### ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్..

తెలంగాణ ప్రభుత్వం వచ్చాక నిరంతర విద్యుత్‌తో సంతోషంగా ఉన్నం. బావులు, బోర్ల కింద బంగారు పంటలు పండుతున్నయ్. 10హెచ్‌పీ మోటరంటే రైతుకు తలకు మించిన భారమే. లోడు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిబూడిదవుతయి. మాయదారి పార్టీ నాయకులు వ్యవసాయాన్ని కుప్పకూల్చే ప్రయత్న చేస్తున్నరు. అన్నదాతలు అంతా బాగా ఆలోచించాలి.

– కైరోజు లక్ష్మణ్, శ్రీనగర్ కాలనీ, పెద్దఅంబర్‌పేట



### రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతుల పక్షపాతి కాబట్టే 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. ఆ పార్టీని నమ్ముకుంటే మళ్లీ తిప్పలు తప్పవనే చెప్పాలి. రైతులు ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

– కావలి సత్యనారాయణ, దేవునిఎర్రవల్లి గ్రామం (చేవెళ్ల రూరల్)



### మూడు గంటల కరెంట్‌తో మడి కూడా పారదు..

వ్యవసాయానికి మూడుగంటల కరెంట్ సరిపోతుందని ఓ పార్టీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు. ఒక్క మడి కూడా పారదు. కాంగ్రెస్ నమ్ముకుంటే రాత్రిపూట పంటలకు నీరు పెట్టేందుకు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తది.

– కౌకుంట్ల మధుకర్‌రెడ్డి, చర్లగూడ(షాబాద్)



### మునుపటి కష్టాలు తప్పవు..

గతంలో కరెంట్ కోసం కష్టాలు పడ్డం. మళ్లీ మూడు గంటల కరెంట్ అంటే మునుపటి కష్టాలు తప్పవు. ఇప్పుడున్న 24 గంటల కరెంట్‌వో హాయిగా ఉన్నం. బాయిలు, బోర్లళ్ల నీళ్లు పుష్కలంగా ఉన్నయి. కొందరి నాయకుల మాటలు నమ్మలేము. బాయిలు, బోర్ల కాడ జాగారం చేయాల్సి వస్తది.

– గంగని శ్రీనివాస్, కొహెడ, తుర్కయంజాల్ మున్సిపాలిటీ